■ శ్రీపతి
■ చిత్రాలు: నెడుంజెళియన్

# మా ఊరు

ఢిల్లీని విడిచిపెట్టేస్తేనే తప్ప ఈ ఒంటరితనం తొలగిపోదని, తిరిగి ఢిల్లీలో అడుగు పెట్టకూడదని అనుకున్నప్పుడల్లా బాధించింది ఒక్కటే- శాలినికి అందనంత దూరం వెళ్ళిపోతున్నానని. నా నిర్ణయం బయట పెట్టకముందే శాలినికి తెలిసి పోయింది. ఆమె ఎట్లా కనిపెట్టిందో. ఏదో సందర్భంలో నాకు తెలియకుండానే మాట జారి ఉంటాను. నా మాటల్లో ఎక్కడో ఆమెకి నా అంతరంగం ఆ సంకేతాలని ప్రసారం చేసి ఉంటుంది.

ఈ ఊళ్ళో ఏముందని, ఎందుకు బతుకుతున్నట్టు- అన్న ప్రశ్న గత ఏడాదిగా పెరిగి పెరిగి పెనుభూతమై భయపెట్టసాగింది. ఈ చదువులే దండగ అని తేలిపోతున్నప్పుడు నేను చదువు చెప్పడం ఒక విడ్డూరమే. మనసు వికలం అయిపోయింది. ఇక్కడ నించి పారిపోతేనే తప్ప ప్రమాదం తప్పదు. పన్నెండేళ్ళు కట్టి పడేసిన ఆకర్షణ ఏముందని ఇక్కడ. మా ఊరు సముద్రం ముందు యమునా నది ఎంత? పిచ్చిపిచ్చి ఆలోచనలూ. భయాలూ. మళ్ళీ డాక్టర్ అవనీశ్ చంద్ర...

కళ్ళ ముందు శాలిని...

"ఇక్కడ వద్దనుకుంటే మీరు మీ ఊరు వెళ్ళిపోగలరు. అక్కడ అమ్మ ఉంది కాబట్టి. మీరు పుట్టి పెరిగిన ఊరు కాబట్టి. మీ సముద్రాన్ని చూసుకుంటూ అక్కడ మీరు బతికిపోగలరు. అంతా మరిచిపోనూ గలరు. మీ ఊళ్ళో మీ తోటలూ - ఆ అందాల మధ్య ఎవరూ మీకు గుర్తు రాకపోవచ్చు. అయితే, ఈ ఆడవాళ్ళకు అది చేతకాదు. మరిచిపోలేరు. ఆడవాళ్ళు ఉరిపోసుకుంటారు. ఎందుకని? దుఃఖాన్ని తట్టుకోలేకనే. లేదూ పిచ్చివాళ్ళవుతారు."

"చూడండి శాలినీ, ఈ మహానగరంలో పన్నెండేళ్ళ కింద ఎన్నో స్వప్నాలతో అడుగుపెట్టాను. సివిల్ సర్వీసెస్ కోచింగ్ ఢిల్లీలోనే మంచిదని, తప్పకుండా నెగ్గుతానని నాపై నాకు పెద్ద నమ్మకం. ఇంటర్వ్యూ దగ్గర గట్టెక్కలేకపోయాను రెండుసార్లూ. పుట్టుకతో పిరికివాణ్ణి. అదే కారణం. పిరికితనాన్ని జయించి ఉంటేనా. వెంటనే ఇంటి ముఖం పట్టాల్సింది. త్వరగా ఏదీ తేల్చుకోలేను. ఊగిసలాట. నా స్వభావమే అది. నా లోపాలు నాకు తెలుసు. ఓటమితో మరింత పట్టుదల. జె.ఎన్.యూలో చేరటం ఎమ్.ఫిల్ కోసం. తర్వాత పిహెచ్.డి. నేను ఢిల్లీలో అడుగుపెట్టిన తరువాత ఆరుగురు ప్రధాన మంత్రులు మారిపోయారు. కానీ, నా జీవితంలో మాత్రం మార్పు లేదు. ఎర్రకోట బురుజుల మీద జాతీయ పతాకానికి జాతి వందనం చేసినప్పుడల్లా ఇక్కడ మరొక సంవత్సరం గడచిపోయిందే అని ఏళ్ళు లెక్కపెట్టుకుంటాను. కాలేజీ... విద్యార్థులూ... తోటి అధ్యాపకులూ... హోటల్... లైబ్రరీ- ఇంతే బతుకు. ఎప్పుడన్నా సెమినార్లకి. అది కూడా నా వృత్తి సంబంధం అయినప్పుడే. ఇప్పుడేమనిపిస్తున్నదంటే - జీవితంలో పన్నెండేళ్ళు - అమూల్యమైన కాలం వ్యర్థమైపోయిందనే. అందుకే ఇప్పుడు పశ్చాత్తాపం. ప్రపంచాన్ని గెలవాలన్న తీవ్ర కాంక్షతో, అహంకారంతో వచ్చానో ఏమో, ఇప్పుడు పరాజయాన్ని స్వీకరించలేకపోతున్నాను. వట్టి పరాజయం మాత్రమే కాదు, పరాభవం కూడా. నన్ను యోధుడిగా చూసిన మా ఊళ్ళోకి తలవంచుకుని ఇప్పుడు వెళ్ళడం సిగ్గుగా ఉంది. అవమానంగా ఉంది."

శాలిని చిన్నగా లోలోపల నవ్వుకుంటున్నది నా మాటలకు.

"జపాన్ కళాభిమాని ఒకాయన సాయంత్రం వస్తున్నారు. నా పెయింటింగ్స్ చూస్తారట. ఉత్తమ్, పిల్లలూ, వర్మా వస్తారు. చెప్పు నువ్వు వస్తున్నావు కదా" అంది శాలిని ఉదయం.

నేను వచ్చేసరికే శాలిని ఇంటిముందు సి.డి కారు కనిపించింది. అంటే విదేశీ రాయబార దౌత్యాధికారి హోదా కారన్నమాట అది.

హాల్లోపల అడుగు పెట్టేసరికి కార్పెట్ మీద పరచిన పరుపుమీద వాళ్ళ దేశాచార పద్ధతిలో వజ్రాసనంలో కూచుని ఉన్నాడా జపాన్ పెద్దమనిషి. అప్పటికే చిత్రాలు చూడడం ముగిసినట్టుంది. గేటు చప్పుడుతో నా రాక తెలిసి వచ్చిన శాలిని నా చేతిలో మామిడిపండ్ల బుట్ట చూసి ఎగిరి గంతేసినంత ఉప్పొంగిపోయింది. బుట్టను అందుకుని, కరన్‌ని పిలిచి, వాడు వచ్చేవరకు తానే చేతుల్లో కిందన్నా పెట్టకుండా పట్టుకుంది.

బుద్ధ విగ్రహంలా ఉన్నాడా జపాన్ కళాభిమాని. ప్రశాంతమైన ముఖవర్చస్సు. నడివయసు మనిషి. లేత నీలం రంగు సూటు. సాక్స్ తీసేసిన పాదాలు.

అతడే తెచ్చిపెట్టినట్టున్నాడు అందమైన పుష్పగుచ్ఛం. హాల్ మధ్యలో పొట్టికాళ్ళ చతురస్రాకారపు బల్లమీద ఆ పుష్పగుచ్ఛాన్ని ఉంచారు. చిన్నదే అయినా ఎంతో కళాత్మకంగా ఉంది. శాలిని కోసం రెండు పుస్తకాలను కూడా కానుకగా ఆయన తెచ్చినట్టున్నాడు. అవి కూడా ఆ బల్లమీద పూలు

> "ప్రపంచాన్ని గెలవా
> లన్న తీవ్ర కాంక్షతో,
> అహంకారంతో వచ్చానో
> ఏమో. ఇప్పుడు పరా
> జయాన్ని స్వీకరించ
> లేకపోతున్నాను."

లాగానే ఉన్నాయి. పక్కనే పెద్ద ఆకురూపంలో అలంకార ప్రాయమైన వాల్నెట్ పాత్రలో నిండా రకరకాల ఎండిన పళ్ళూ, జీడీ, బాదాం, పిస్తా వంటి రకరకాల పప్పులూ. ఆనుకునే కేన్ బుట్టలో రంగురంగుల పళ్ళూ.

పరస్పర పరిచయాలు. తన పక్కనే కూచోమన్నట్టు చోటు చూపించాడాయన ప్రేమగా. మామూలుగా శాలిని కూచునే చోటది. నేను నా అలవాటు ప్రకారం ఎదురు పరుపు మీద కూచున్నాను. నా పిహెచ్.డి ఎకనామిక్స్‌లో అని తెలిసి గేమ్ థియరీ గురించి, నాష్ ఈక్విలిబ్రియమ్ గురించి మా మధ్య ముచ్చట్లు. బల్లమీద ఉన్న కొత్త పుస్తకాల మీదికి నా మనసు పోయింది. ఒకటి - జపాన్ ప్రాచీన చిత్ర కళమీద. రెండోది- జపాన్లోని గొప్పగొప్ప బౌద్ధ దేవాలయాల బొమ్మలతో.

ఆరేళ్ళ కిందట సరిగ్గా క్రిస్మస్ రోజున శాలిని కోసం ఓ చిన్న పూల గుత్తితో వచ్చినప్పుడు ఆమెకు రెండు పుస్తకాలు ఇచ్చాను. అన్నా ఫ్రాంక్ డైరీ. టాగూర్ గీతాంజలి. ఆ రెండు పుస్తకాలూ ఆమెకు చాలాచాలా ఇష్టమంట! ఆ రోజు నాకు ఈ హాల్ వింతగా తోచింది. హాల్ నిండా బొమ్మలే. గోడలకి కేన్వాస్‌లు. కొన్ని గోడ లోపల అమర్చిన రాతి పలకల మీద బొమ్మలు. గోడకి కట్టె చెక్కలమర్చిన తీరే కొత్తగా ఉంది. వాటిమీద బొమ్మలు. నేల మీద కట్టె మొద్దుల మీద బొమ్మలు. రాళ్ళు పెద్దపెద్దవి పొందికగా, అలంకారంగా అమర్చి వాటి మీద బొమ్మలు. పక్కనే పెద్దపెద్ద ఆకుల మొక్కలు. ఇంటి నిండా జాడీలతో మొక్కలు. ఆ హాల్‌లో ఒక్క పొట్టి కాళ్ళ చతురస్రపు బల్ల తప్పించి కుర్చీలూ, సోఫాలు ఏమీ లేవు. కార్పెట్ నేల. అతిథులు వస్తే కూచోవటానికి పరుపులు, దిళ్ళూ. అట్లాంటి అలంకరణ నాకు కొత్త. నేను ఎన్నడూ చూడలేదు. అది ఇల్లు అనిపించలేదు. బొమ్మరిల్లు అంటే ఇదేనో ఏమో.

ఆ జపాన్ పెద్దమనిషిని సాగనంపి వెనక్కి వచ్చి ముందుగా అమ్మ పంపిన మామిడిపండ్లకు థాంక్స్ చెప్పింది శాలిని. అమ్మకి ఈసారి ఉత్తరం రాసేటప్పుడు నా ప్రయాణం సంగతి గుర్తులేక తన నమస్కారాలు చెప్పమంది.

ఆ సి.డి కారు కదిలిపోయిన తరువాత 'అయ్యో ఆయనకి రెండు మామిడి పళ్ళు ఇవ్వాల్సిందే' అనుకుంది శాలిని. ఒకటి రెండు రోజుల్లో తాను కొనుక్కోవాలనుకున్న పెయింటింగ్స్ తీసుకుపోవటానికి వచ్చినప్పుడు ఇవ్వవచ్చులే అనుకుంది.

ఉదయం శాలిని ఫోన్ చేసి ఇంటికి రమ్మనకపోతే ఇవాళ వచ్చేవాడిని కాదు. రేపు వచ్చేవాడిని. రేపటికి పళ్ళు పండేవి. మరింత రంగు తేలేవి. తినటానికి పనికొచ్చేవి. మా ఊర్నించి మా బంధువు తన పని మీద ఢిల్లీ వచ్చాడు. ఉదయమే స్టేషన్‌కు పోయి పళ్ళు తెచ్చుకున్నాను.


"స్వాప్నికులు కళాకారుడో, రచయితో అయితే సాంస్కృతిక జగత్తుకు ఎంతో మేలు. మీరేమో ఆ కోవకు చెందరాయె. మరి మీ స్వప్నాలు ఏమిటో మీకన్నా తెలుసునా అని నా అనుమానం. పన్నెండేళ్ళు వృథా అయిపోయింది అని ఇప్పుడు చింతిస్తే-"

శాలిని మధ్యలో వాక్యాన్ని ఆపేసి ఏదో గుర్తు తెచ్చుకున్నట్టు లోపల గదిలోకి వెళ్ళింది.

స్ఫటికంలా మెరుస్తున్న రెండు గుండ్రటి వెడల్పాటి పొట్టి గ్లాసుల్లో నిండా ఎర్రటి పండ్లరసంతో వచ్చి ఆ రెండుగ్లాసుల్ని బల్లమీద పెట్టింది శాలిని.

"చెప్పండి రావ్, దానికి ఎవర్ని తప్పుపడ్తారు? పదవీ, హోదా, అధికారం, సంపదా, గౌరవం - ఎన్నో ఆకర్షణలు మనల్ని ఊపిరి తీసుకోనివ్వవు. వాటి వెంట పడతాం. అట్లాంటి వ్యామోహంతోనే వచ్చినట్టున్నారు మీరు ఢిల్లీ, కాదా? అందువల్లనే మీకీ నిరాశ. ఒకసారి ఆ స్వప్న జగత్తు నించి

# సముద్రం



బయటపడ్డారనుకోండి- ఏ నిరాశా ఉండదు, ఏ బాధా ఉండదు. అవునా?"

పండ్లరసం డీప్ ఫ్రిజ్ నించి తెచ్చినట్టుంది. చల్లగా ఉంటంవల్ల ఐస్‌క్రీమ్ తిన్నట్టుగా చప్పరించవలసి వస్తున్నది. నెమ్మదిగా, చిన్నగా తీసుకోవడం శాలిని పద్ధతి. టీ తాగినప్పుడు కూడా. సెగలు కక్కే టీ తాగటం నా అలవాటు. పల్లెటూరి అలవాట్లులే అనుకుంటుంది శాలిని.

"చెప్పండి రావ్? దానికి ఎవర్ని తప్పుపడ్తారు?"

శాలిని ఇంగ్లీషు ఉచ్చారణ అందం, ఆ గొంతులో స్పష్టత, ఆమె స్నేహభావం, నా పట్ల ఆమె శ్రద్ధ, ఆమె దరహాస వదనం, ఆ మాటల్లో వివేకం, ఆమె చుట్టూ ఆవరించి ఉన్న ప్రశాంతమైన ఆత్మీయత- ఇవన్నీ అపురూపం. ఆమె స్నేహ భాగ్యం ఒక వరం. ఆమె ముందు కూచుంటే కళా జగత్తు ముందున్నట్టుంది. ఆమె మాటలు మనసుకు పట్టవు. మనసు స్వాధీనం తప్పుతుంది- ఆమె చెప్పేది మరోసారి వింటేనే తప్ప.

ప్రేమ వివాహం తప్ప పెద్దలు చేసే పెళ్ళి ససేమిరా వద్దనుకున్న మీరు ఇంతకాలం పెళ్ళెందుకు చేసుకోలేకపోయారు? ఎందుచేత? పెళ్ళి చేసుకుని ఉంటే ఒక స్వప్నం తీరేది కదా? మీరెందుకు పెళ్ళి చేసుకోలేదో చెప్పండి రావ్? ఈ విషయం మిమ్మల్ని చాలా రోజుల్నించి అడగాలనుకుంటున్నాను. చెప్పండి" అని శాలిని వినోదంగా నవ్వుతూ కళ్ళలోకి చూసింది. నవ్వులాటకు అడుగుతున్నట్టుగా ఆ మాటల్లో ధ్వని.

ఆ వేసవి సాయంత్రం ఢిల్లీవాసులు ఎండల మంటలకు జడిసి కిటికీలూ, తలుపులూ మూసేసుకుని ఏసీలతో, కూలర్లతో చల్లబడుతున్న గదుల్లో తమని తాము బంధించుకుని గడుపుతున్నారు. బయట అడుగుపెట్టాలంటే వడదెబ్బ భయం. ఢిల్లీ ఎండల ప్రతాపం ఏమిటంటే, రాత్రిళ్ళు సైతం సెగలు కక్కుతూనే ఉంటాయి. అయినా, ఢిల్లీ జనం మండే ఎండల్ని గాని, ఘూల్లుల పీల్చేసే చలినిగాని పల్లెత్తు మాట అనరు సరికదా ఆ ఎండల్నీ, చలినీ గొప్ప అందాలుగా కీర్తిస్తారు. లేదా చలోక్తులు వేసి నవ్వుకుంటారు. ఇప్పుడు శాలిని నవ్వుకుంటూనే నిలదీస్తున్నది తన ప్రశ్నతో నన్ను.

ఆమె అడిగిన ప్రశ్నకు సమాధానం నేను చెప్పలేనని, చెప్పబోనని ఆమెకి తెలుసు. అయినా అడిగిందామె.

పెళ్ళి ప్రస్తావన శాలిని నోట రావటం ఇదే తొలిసారి. మా చర్చలు సామాన్యంగా వ్యక్తిగత జీవితాల వేపు పోవు. పోలేదు.

కలుసుకున్నప్పుడల్లా మేము మాట్లాడుకునేవి మామూలు సంగతులే. డాక్టర్లూ, జబ్బులూ, మందులూ, ఆస్పత్రులూ, పత్రికల్లో వార్తలూ, విడ్డూరాలూ, ఆటలూ, పాటలూ, సినిమాలూ, తారలూ. జనంలో రోజురోజుకీ పెరుగుతున్న నేరప్రవృత్తీ, జనం ధనవ్యామోహం- ఇట్లాంటివే.

ఎప్పుడన్నా ఆమె వాళ్ళ అమ్మగారి గురించి చెప్తుంది. లాస్ ఏంజిలిస్‌లో ఇప్పుడు అమ్మ అన్నయ్య దగ్గర ఉందనో, లేదా అక్క దగ్గరకు చికాగో వెళ్ళిందనో తప్ప సొంత విషయాలు రావు. ఇద్దరికీ ఇద్దరి కథలూ తెలుసు. అంతే. ఢిల్లీ రాజకీయాల్లో ఆమెకి ఆసక్తి లేదు. ఆమె తాతగారు రాజ్యాంగ చట్ట సభ సభ్యుడు. అయినా, ఆ ఘన కీర్తి ఆమెకు పట్టదు. రాజకీయాలు నాకు బొత్తిగా పట్టవు. మరుగుజ్జు నాయకులూ, పార్టీలూ ఇప్పుడు దేశాన్ని ఏల్తున్నారనీ ఏకాభిప్రాయం.

నేనొచ్చినప్పుడల్లా ముందు ఒక పెద్ద నవ్వు నవ్వి 'మీ ఊరు సముద్రం కుశలమేనా రావ్' అని అడుగుతుంది శాలిని. రెండో ప్రశ్న 'మీ అమ్మగారూ, మీ కొబ్బరి తోటా బావున్నట్టేనా' అని. నేను ఆమెతో చెప్పేవి ఆ ముచ్చట్లే కాబట్టి. ప్రపంచం నాకేం తెలుసు చెప్పటానికి. మా ఊరు గురించి చెప్పగలను.

అట్లాగే మా అమ్మ గురించి. ఇవేళ మా ఉద్దానం మామిడి పండ్ల బుట్టను అందుకున్నప్పుడు ఆమె 'హాయ్ హాయ్ హాయ్' అని సంతోషంతో నాట్యం చేసింది. ఆ జపాన్ కొత్త మనిషి ఇంట్లో ఉన్నాడని కూడా పట్టించుకోలేదు. గత ఐదారేళ్ళుగా అమ్మ నాకు పళ్ళు పంపించినప్పుడల్లా - లేదా నేను మా ఊరు పోయి తెచ్చినప్పుడల్లా ముందు శాలిని వాటా అని ఆమెకే ఇచ్చి వస్తాను. మామిడి పళ్ళల్లో నాకు చెరకు రసాలూ, సువర్ణ రేఖలూ ఇష్టం. సువర్ణ రేఖలను ఇక్కడ ఢిల్లీ వాళ్ళు 'సింధూర్' అంటారు. ఆంధ్ర దేశం నుంచి పండ్ల వేగన్‌లు ఢిల్లీ వచ్చే రోజుల్లో ఇక్కడ పత్రికలు ఆ పండ్ల వర్ణనలతో, లెక్కలతో, ధరల వివరాలతో, ఫోటోలతో ప్రత్యేక వ్యాసాలు ప్రచురిస్తాయి. ఈ పండ్లను కీర్తిస్తాయి. ఢిల్లీకి పండ్లంటే ప్రేమ.

ఇవే ముచ్చట్లు మామధ్య. ఆ ముచ్చట్లలోనే ఎంతో వినోదం. పగలబడి నవ్వుకుంటాము.

పెళ్ళి గురించి శాలిని నవ్వులాటగానే మాట్లాడుతున్నా నేను నవ్వుకోలేకపోయాను. ఆమెతో చెప్పుకోవడానికి సిద్ధంగా ఉన్న కథలన్నీ జలపాతంలా ఉరకడానికి తొందరపడుతున్నాయి. మనసు ఉక్కిరిబిక్కిరయింది. గుండె లోతుల్లో అణగదొక్కుకున్న స్వప్నాలన్నీ స్వేచ్ఛా విహంగాల్లా విహరించ సాగాయి. ఇదే చక్కటి అవకాశం. ఈ అవకాశం మరోసారి రాకపోవచ్చు. జారవిడచుకోవద్దు సుమా అని ఓ పక్క, ఢిల్లీ నుంచి పోతూ పోతూ చివరిసారిగా వచ్చి కలుసుకుంటున్న ఈ సమయంలో నిగ్రహం కోల్పోకూడదు జాగ్రత్త అని హెచ్చరిక ఇంకోపక్క. అందువల్ల మౌనం. నన్నెన్నో

"ఆమెతో చెప్పుకోవ
డానికి సిద్ధంగా ఉన్న
కథలన్నీ జలపాతంలా
ఉరకడానికి తొందర
పడుతున్నాయి. మనసు
ఉక్కిరిబిక్కిరయింది."



ఆపదల్లో ఈ మౌనం కాపాడింది. ఇప్పుడు కూడా. బలవంతంగా నవ్వు తెచ్చుకుని నోరు మూసుకున్నాను.

పెళ్ళి మాటకు అర్థం స్ఫురించే సందర్భం జీవితంలో ఇంతవరకు రాలేదని- హృదయం ఆ స్పందనలను పలకడం లేదు. ఈ విద్య పేరుతో పేరుకుపోయిన మురికి ప్రక్షాళనం కానిదే బుద్ధి కాలుష్యం నుంచి విముక్తి లేదు. ఈ అంధత్వం నుంచి బయట పడడానికి ఎన్నేళ్ళు పడ్తుందో. ఢిల్లీ నుంచి పారిపోవడం ఒక్కటే నాకు కనిపిస్తున్న దారి. అందుకే మా ఊరు. మా సముద్రం. ఒక్క సముద్రం మాత్రమే ఈ కాలుష్యాన్ని శుద్ధి చేయగలదు. అప్పుడు గాని నేను శాలిని ప్రశ్నకు సమాధానం చెప్పలేను. ఈ ఊరు వచ్చిన కొత్తలో అబద్ధం చెప్పాలంటే భయం. ఇప్పుడు నిజం చెప్పటానిక్కూడా భయమే. పిరికివాణ్ణి అన్నాను కదా.

నాకు తెలిసిన విషయాల గురించి అడిగితే ఎంతసేపన్నా మాటాడగలను.

'ఇప్పుడు సాయంత్రం ఏడు గంటలవుతోంది కదా. మీ అమ్మగారు ఏం చేస్తుంటారు మీ ఊళ్ళో' అని శాలిని అడుగుతుంది. వీడ్కోలు ముందు మామూలుగా అడిగే ప్రశ్న ప్రతిసారి. మా పల్లె జనం కథలు చెప్పించుకుని వినడం ఆమెకి ఇష్టం.

'అమ్మ ఇప్పుడు తోటలో ఉంటుంది. తోట బాగా దూరం. ఇరవై నిమిషాలకు పైనే నడవాలి. ఇసిక భూములు కదా. ఒక్క ట్రాక్టర్ తప్ప ఏ వాహనాలూ పోవు. మేము మా పశువుల్ని ఊళ్ళో ఇండ్ల మధ్య కట్టుకోము. తోటల్లో కడ్తాము. తోటలకు ఎరువు కావాలి కదా. అందుకోసం. ఊళ్ళల్లో పశువులు ఉండవు కాబట్టి ఊళ్ళు ఎంతో పరిశుభ్రంగా ఉంటాయి. మేతకు వెళ్ళిన పశువులు ఈ సమయానికి వెనక్కి వస్తాయి. వాటిని మందమీద కడ్తాము. వాటికి నీళ్ళా, కుడితీ, గడ్డీ; వాటి శుచీ శుభ్రతా - అన్నీ చూసుకోవాలి. పాడి పశువులుంటాయి. దూడలను పాలకు విడవడం, పాలు తీసుకోవడం. రెండోరోజు తెల్లవారి వచ్చేవరకూ అవి సుఖంగా ఉండాలని దేవుణ్ణి మొక్కుకోవడం - రాత్రవుతుంది. అన్నీ తోటలే. కొబ్బరి తోటలే కదా. చీకటి మరీ దట్టంగా ఉంటుంది. వెన్నెల రోజుల్లో కొంత నయం. తోటల్లోంచి, దారిలో ఇతర తోటల్లోని తోటి మనుషుల్ని పలకరించుకుని కాలిదారిన దారి పొడవునా కథలూ, కబుర్లూ చెప్పుకుంటూ అంతా ఇల్లు చేరుకుంటాము. ఇప్పుడు ఈ వేళకి అమ్మ చేసే పనులు అవే. సహాయం కోసం ఇంటి వాళ్ళో, పని వాళ్ళో ఉంటారు. దగ్గరుండి చేసుకోవాలి పనులు.'

"మీ ఊరు సముద్రం ఇప్పుడేం చేస్తుంది?" ఇది కూడా కలసినప్పుడల్లా శాలిని అడిగే ప్రశ్నే.

సముద్రం అంటేనే ఆమెకు ఆరాధన. అయితే, ఈ ప్రశ్న మాత్రం నన్ను ఆట పట్టించడానికే. సముద్రం నా అబ్సెషన్. మా ఊరు సముద్రాన్ని ఒక్కోసారి ఒక్కో విధంగా వర్ణిస్తాను. ఆ అందం గురించి ఎన్నిసార్లు చెప్పినా తనివి తీరదు. మా సముద్రాన్ని తలచుకునే మహాభాగ్యాన్ని శాలిని కల్పించిందని.

ఒడ్డుకు విరిగిపడే సముద్ర కెరటాల పాలవెల్లువ లాంటి నురుగుకి సరిపోదు ప్రపంచంలోని ఏ అందమైనా సరే అంటాన్నేను. నిజమే కదా. ఆమె మాత్రం కాదనగలదా? సముద్రం అందానికి పోలికెక్కడ? నవ్వుకుంటూ కూచుని నా మాటలు వింటుంది శాలిని. 'వర్షం కురుస్తున్నప్పుడు చూడాలి మా సముద్రాన్ని. పైన ఆకాశంలో ముసురుకొచ్చే మేఘాలు. కింద మేఘాలను తాకాలన్నట్టు ఉప్పొంగి పోయే సముద్రం. ఆ సుందర నృత్య దృశ్యాన్ని

చూస్తూ ఎంతసేపన్నా కూచోవచ్చు. ఆ అందాన్ని తుఫాన్ బీభత్సంలో చూడాలి. ఆ బీభత్సం ఎంత అపురూపం! ప్రకృతి తల్లి మహాశక్తి విశ్వరూప దర్శనం లాగ. ఆ ముందు మనిషి పిపీలకంలా ఉంటాడు. అయినా, చెలియలి కట్ట దాటదు' అని ఎంతసేపన్నా కీర్తించగలను.

శాలిని దేశదేశాలలో చాలాచాలా సముద్రాల్ని చూసి ఉండొచ్చు. ఆమె చూసిన సముద్రాలు వేరు. మా ఊరు సముద్రం వేరు. తల్లిలాంటి చల్లని మనసు... మా ఊరు సముద్రం.

"రావ్ మీరు రచయిత అవుతారు ముందు ముందు" అంటుందామె.

"నేను రచయితను అవుతానో, కాదో చెప్పలేను కాని, తప్పకుండా చిత్రకారుణ్ణి మాత్రం అవుతాను శాలినీ, మీ నెయ్యంతో" అంటాన్నేను.

అంతలో గేట్ తెరచుకున్న చప్పుడు.

ఆరేళ్ళ కొడుకును నడిపించుకుంటూ వర్మ, మూడేళ్ళ పాపని ఎత్తుకుని ఉత్తమ్ లో పలికి వచ్చారు.


"ఉత్తమ్, రావ్ సాబ్ ఇక్కడే ఉన్నారు" అని వర్మ భార్యతో చెప్పాడు.

ఇద్దరూ నవ్వు ముఖాలతో ప్రేమతో పలకరించారు.

> "సముద్రం అందాన్ని తుఫాన్ బీభత్సంలో చూడాలి. ఆ బీభత్సం ఎంత అపురూపం! ప్రకృతి తల్లి మహాశక్తి విశ్వరూప దర్శనం లాగ."

ఆరు నెలలుగా పిల్లల్ని తీసుకురావడం లేదని వర్మ మీద శాలిని కోపం. సెలవులకు పిల్లల్ని అమ్మమ్మ సిమ్లా తీసుకు పోయిందని, పిల్లలకు ఆరోగ్యం బాగా లేదని, పనుల ఒత్తిడి మూలంగా రాలేకపోతున్నామనీ, ఉత్తమ్ ఊళ్ళో లేదు అందువల్లనే రాలేదని– ఆ సంజాయిషీలన్నీ వట్టి అబద్ధాలే అని శాలిని అభిప్రాయం. మధ్యలో ఓసారి పిల్లల్ని తీసుకుని రాకుండా ఇద్దరే వచ్చారు. ఆ రోజు శాలిని ఉత్తమ్‌తో మాట్లాడ లేదు. మధ్యమధ్య వర్మ రెండు మూడు సార్లు ఒక్కడే వచ్చి వెళ్ళాడు. ఉత్తమ్ రాలేదు. శాలినికి విపరీతంగా కోపమొచ్చింది. పిలిచి ఫోన్‌లోనే గట్టిగా తిట్టాలను కుంది. ఆ రోజు ఫోన్ మీద ఉత్తమ్ దొరకలేదు. ఓ రోజు ఉత్తమ్ ఒక్కతే వచ్చింది. శాలిని నోరెత్తలేకపోయింది. ఉత్తమ్ నటన ముందు ఓడిపోయింది.

ఇదివరకు వారం వారం పిల్లల్ని తీసుకుని వచ్చేవాళ్ళు. వాళ్ళు సినిమాకో, నాటకానికో, సాంస్కృతిక కార్యక్రమాలకో, విందులకో, దేవాలయాల్లో పూజలకో, బంధుమిత్రుల ఇండ్లకు మర్యాదలకు వెళ్ళే పిల్లల్ని తెచ్చి శాలిని దగ్గర విడిచిపెట్టేసే వాళ్ళు. ఆ పిల్లల్తో ఆడుకోవడం శాలినికి ఇష్టం. తనకు పిల్లలు కలగబోరని వైద్య పరీక్షల తర్వాత తెలిసి – వర్మ రెండో పెళ్ళికి శాలిని ఇష్టంగానే ఒప్పుకుంది. శాలినిలా ఎత్తయిన మనిషి కాకపోయినా ఉత్తమ్ అందగత్తె కిందనే లెక్క. ఆమె అలంకరణ తీరు కూడా ఆకర్షణే. ఇవేళ గుజరాతీ పద్ధతిలో చీర కట్టుకుని వచ్చింది. ఉత్తమ్ సిమ్లా ఆపిల్ పండు రంగు. శాలిని మొసాంబి పసుపు రంగు. శాలినికి బెంగాలీ పద్ధతి ఇష్టం. నిరాడంబరమైన వేషం. అలంకరణ బొత్తిగా ఉండదు. ఒంటిమీద నగ అన్నది కనిపించదు. చేనేత నూలు బట్టలు. చుడీదార్ పైజామాలు. ఉత్తమ్ మాటల్లో తెలివైంది, చురుకయింది.



శాలిని తాబేలు రకం. నెమ్మది. మాట్లాడినా సరే. ఉత్తమ్ వయసులో శాలిని కన్నా పెద్దదే అనిపిస్తుంది. దాదాపు వర్మ వయసు.

విదేశీ దౌత్య కార్యాలయంలో పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ మొన్నమొన్నటి వరకు. పూర్వాశ్రమంలో ఆమె ఢిల్లీ ఇంగ్లీషు పత్రికలలో జర్నలిస్ట్. ఢిల్లీ యూనివర్సిటీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి తర్వాత లాలో చేరింది. ఇప్పుడు కూడా ఉత్తమ్ కాపీ రైటింగ్ చేస్తుంది. అది పెద్ద ఆదాయం ఆమెకి.

త్వరలోనే ఇద్దరూ యు.ఎస్ వెళ్ళిపోయే ప్రయత్నాల్లో ఉన్నట్టు శాలిని ఇదివరకే చెప్పింది. వర్మ ఇప్పుడు పని చేస్తున్న మల్టీ నేషనల్ సంస్థ ఆయన్ని కాలిఫోర్నియాకు బదలీ చేస్తున్నదని వాళ్ళు చెప్పుకుంటున్నారు. అయితే, అది యథార్థం కాదని శాలిని అభిప్రాయం.

ఉత్తమ్ చేతుల్లోంచి పాపని ముందు అందు కుంది శాలిని.

"ఏమయింది మున్నీ... ఇంతకాలం అమ్మను చూడకుండా ఎట్లా ఉన్నావే" అని మున్నీని ముద్దులతో ముంచెత్తి, ముచ్చట్లు చెప్తూనే కన్నీళ్ళు పెట్టుకుంది.

శాలినిని మున్నీ అమ్మా అనే పిలుస్తుంది. వాళ్ళ అమ్మని మాత్రం వర్మ పిలిచినట్లుగా ఉత్తమ్ అనే పిలుస్తుంది. పిల్లలు అట్లా పిలవడమే ఉత్తమ్‌కి ఇష్టం. పిల్లల్ని స్నేహితుల్లా చూసుకోవాలని ఉత్తమ్ అవగాహన. ఆ పద్ధతిలో శిక్షణ ఇచ్చింది పిల్లలకు. వర్మని మాత్రం పిల్లలు నాన్న అనే పిలుస్తారు.

ఇదివరలో ఉత్తమ్, "మున్నీ ఉండిపోవే మీ అమ్మ దగ్గర" అని కొన్నిసార్లు మున్నీని శాలిని దగ్గర విడచి పెట్టేసి వెళ్ళేది. మున్నీకి ఇష్టమే. మున్నీని తనకు ఇచ్చేస్తారనీ, తానే పెంచుకుంటాననీ ఇప్పటికీ శాలిని ఆశాభావం.

గత ఆరు నెలల్లో వాళ్ళ ప్రవర్తనలో వచ్చిన మార్పు ఎంతకీ మింగుడు పడలేదు శాలినికి. వచ్చినప్పుడు ఉత్తమ్ ఎంతో ప్రేమతో, నమ్రతా స్వభావంతో, శాలినికి ఏ బాధా కలిగించరాదన్నట్టుగా ఉంటుంది ఇప్పటికీ.

వర్మ లోపలికి పోయి, ఇల్లంతా కలియజూసి కిచెన్‌లో కరన్‌తో మాటాడి వచ్చాడు.

"ఇవేళంతా స్నేహితుల్ని, బంధువుల్ని పలకరించి రావటంతోనే సరిపోయింది. 29 రాత్రి తాజ్ విందు గురించి ఆహ్వానాలు – స్వయంగా చెప్పటమే మంచిదని కార్డు వెయ్యించలేదు" అంటున్నాడు వర్మ.

గత వారంలో వడదెబ్బ మూలంగా వర్మ నాలుగు రోజులు నర్సింగ్ హోమ్ పాలయ్యాడట. తన ఉద్యోగానికి రాజీనామా చేసేసిందట ఉత్తమ్. సిమ్లా నుంచి తల్లీ, తండ్రీ వచ్చి ఇప్పుడు తనతోనే ఉన్నారట. జూన్ ఫస్ట్‌న ప్రయాణంట. అవీ ఉత్తమ్ ముచ్చట్లు.

ఆ ముచ్చట్లు శాలిని వింటున్నట్టు లేదు. మున్నీ ప్రపంచంలో మునిగిపోయి ఉంది.

శాలినికి వీళ్ళ పరుగులాట ఇష్టం లేదు. వాళ్ళకు ఇక్కడ ఏ లోటూ లేదు. ఇద్దరికీ తల్లీ, తండ్రీ సంపాదించి పెట్టిన ఇళ్ళూ, ఆస్తులూ, వ్యాపారాలూ, షేర్లూ ఉన్నాయి. అయినా, సంతృప్తి లేదు.

వర్మకి స్వతహాగా ఈ పరుగు ఇష్టం కాదని శాలిని అంటుంది. అయితే, ఉత్తమ్ దగ్గర నోరెత్తడు. ఈ సారథ్యమంతా ఉత్తమ్‌దే. ఉత్తమ్ ముందు శాలిని కూడా నోరెత్తదు.

మున్నీని తన దగ్గర ఉంచుకోవాలని మనసు పడింది శాలిని. మున్నీ అమ్మవు నువ్వే అన్నట్టుగా ఉండేది శాలిని ప్రవర్తన. అట్లాగే మాట్లాడేది. మున్నీని విడిచి పెట్టేసి, రాహుల్‌నే తమతో తీసుకుపోయేవాళ్ళు. కొన్నిసార్లు మున్నీ రెండు మూడు రోజులు

ఇక్కడే ఉండిపోయేది. ఆ రోజుల్లో శాలిని సంతోషం చూడాలి. మున్నీ ఉంది కదా. స్టూడియోకి పోయేది లేదు. గ్యాలరీకి పోయేది లేదు. ఆహ్వానాలూ విందులూ – అన్నీ మున్నీ ముందు తేలిపోయేవి. మున్నీ తన సర్వస్వం.

ఇప్పుడు వాళ్ళల్లో, ముఖ్యంగా ఉత్తమ్‌లో మార్పు వచ్చింది. పిల్లల్ని ఇంటికి తీసుకుని రాకపోవడంలో ఉద్దేశమే అది. ఆర్నెల్ల తర్వాత ఇదే రావడం. దేశం విడిచి వెళ్ళిపోతున్నాం కదా అని చూపించి పోవటానికి పిల్లల్ని తీసుకుని వచ్చినట్టున్నారు.

శాలిని మీదకు ఉరికి కేకలు పెడ్తూ ఆడుకుంటున్నాడు రాహుల్.

"రాహూ కిందటిసారి ఫైగర్ కబ్ కావాలన్నావు కదా – జూలో లాంటిది. కొనుక్కుందామా రాహూ" అని మధ్య మధ్యలో రాహుల్‌తో ముచ్చట్లు పెడ్తున్నది శాలిని.

ఉత్తమ్ అమాయకురాల్లాగ పిల్లల్నీ, శాలినినీ చూసుకుంటూ, వాళ్ళ ఆటల్లో వినోదిస్తూ వాళ్ళతోనే కూచుని ఉంది. వర్మ లోపలికి కిచెన్‌కి పోయి కరన్‌తో మాట్లాడి సొంత ఏర్పాట్లు చేసుకొని వచ్చాడు. ఇంకా నాలుగు రోజులే మధ్యన. విందు. తర్వాత మూడో రోజే ప్రయాణం. ఆరోగ్య నియమాలు కఠోరంగా పాటిస్తున్నారు. వాళ్ళు వస్తున్నారని ప్రత్యేకంగా భోజనాల ఏర్పాట్లు చేయించింది శాలిని. ఆరోగ్యం ఒడిదుడుకులు కాకూడదని. ముందు ప్రయాణం ఉంది మరి.

ఉదయం నించి తిరుగుతూనే ఉన్నారట. అలసిపోయినట్టున్నాయి ముఖాలు. ఉత్తమ్, వర్మా ముఖాలు కడుక్కున్నారు. పిల్లలకు స్నానాలు చేయించారు. ఉత్తమ్ డ్రెస్ మార్చుకున్నది. పిల్లలకు స్వీట్స్, చాక్‌లెట్స్, పండ్లు అన్నీ నిషేధం. కేవలం ఆపిల్ పండ్ల రసం మాత్రమే. మున్నీ మామిడిపండు ముక్కలు కావాలంటున్నా, ఆరోగ్యం బాగాలేదని వర్మ ఒప్పుకోలేదు. వాళ్ళు టీ మాత్రం తాగి బయల్దేరుతున్నారు.

ఇంకో నాలుగైదు ఇళ్ళున్నాయట. వాళ్ళను కలిస్తే ఇవాళ్టికి వీడ్కోలు మర్యాదలు ముగిసినట్టే. ఢిల్లీలో సెలెబ్రిటీస్ పేర్ల జాబితా ఉత్తమ్ చెప్తున్నది.

"రావ్ సాబ్, తప్పకుండా రావాలి మీరు. సరేనా?" మరోసారి గుర్తుచేస్తూ వర్మ.

సరిగ్గా ఆ 29వ తేదీనే నా తిరుగు ప్రయాణం. దాంతో ఢిల్లీకీ, నాకూ చెల్లు. ఇదే శాలినిని చివరిసారి చూడడం. అయితే, శాలినికి నేను తిరిగి ఢిల్లీకి రానని తెలీదు. ఊరు వెళ్తున్నట్టు మాత్రమే తెలుసు. కాలేజీ వేసవి సెలవులు మొదలైన తొలి రోజుల్లోనే ప్రయాణం పెట్టుకోవాలనుకున్నాను. పరీక్షల పనులు పడ్డాయి. దానికి తోడు పిహెచ్.డి థీసిస్ అచ్చుపని. అది పబ్లిషర్ చెప్పిన తేదీకి పదిహేను రోజులు ఆలస్యంగా వచ్చింది. దాంతో ప్రయాణం వాయిదా పడుతూ వచ్చింది.

వాళ్ళు కదిలిపోతున్నారు పిల్లల్ని తీసుకొని.

సాయంత్రం ఏడున్నర అయినా ఢిల్లీ ఆకాశాన్ని మే నెల సూర్యుడు ఇంకా ఆక్రమించుకునే ఉన్నాడు. భగ్గుమంటున్నది బయట సాయంత్రం.

గేటు వరకూ పోయి వాళ్ళను సాగనంపి, వాళ్ళ కారు కదిలిపోయిన తర్వాత అలసిపోయిన ముఖంతో వచ్చింది శాలిని.

"మీ అమ్మ దగ్గర ఉండిపోవే మున్నీ అన్న మాట ఇప్పుడు ఉత్తమ్ నోట రావడం లేదు చూడు రావ్! కనీసం ఇవాళన్నా పిల్లల్ని ఇక్కడ విడిచిపెట్టేసి వాళ్ళ వీడ్కోలు సందర్శనాలు ముగిసిన తర్వాత వచ్చి పిల్లల్ని తీసుకుపోవచ్చు కదా! చూడు రావ్, ఉత్తమ్ తెలివి" అని శాలిని తన సర్వస్వం కోల్పోయినట్టు దిగులు చూపులతో దిక్కుమాలిన తల్లిలా కనిపించింది. అక్కడ నిలవలేక కళ్ళు తిరుగుతున్నట్టుగా అనిపించిందో ఏమో కళ్ళు రెండుచేతుల్తో మూసుకుని గబగబా తన గదిలోకి వెళ్ళిపోయింది.

ఇప్పటికే ఆలస్యమైంది. నేనూ వెళ్ళిపోవాలి. ఆమె బయటకి వస్తే చెప్పేసి చివరి వీడ్కోలు తీసుకొని బయట పడాలి. ఊరు చేరుకున్న తరువాత తీరిగ్గా పెద్ద ఉత్తరం రాయాలి. ఆమె అపూర్వమైన స్నేహానికి మనసారా కృతజ్ఞతలు చెప్పుకోవాలి. 'ఇక్కడ నేను ఇప్పుడు ఏం చేస్తున్నానో తెలుసా శాలినీ, మా సముద్రం బొమ్మలు వేస్తున్నాను. ఇటు వస్తే మొగలిపూల పరిమళాల మధ్య నించి కాలిబాటలో పోయి తన ముందు నించుంటే మా ఊరు సముద్రం నీకు భవిష్యత్తు అంతా సరిపోయే రంగుల్ని ఇస్తుంది. వాటితో నువ్వు నీ కేన్వాస్‌ల నిండా అంతర్లోకాల్లో పూసే పరిమళ సంపన్నమైన పూలను నింపుకోవచ్చు' అని రాసుకోవాలి. ఇంక ఉత్తరాలే!

గత ఆరేళ్ళుగా ఈ బొమ్మలు చూస్తున్నాను. అవి తొలిరోజుల్లో కేవలం బొమ్మలు మాత్రమే. కానీ, ఇప్పుడు అవన్నీ గొప్ప కళాఖండాలని తెలుస్తున్నది. అమృతా షెర్‌గిల్, శైలజ్ ముఖర్జీ, రహ్మాన్ చుగ్తాయ్, అవనీంద్రనాథ్ టాగూర్, జెమినీ రాయ్ మొదలుకుని ఈనాటి వరకు. వందల ఏళ్ళ పురాతన రాజపుత్ర, మొగల్, దక్కనీ లఘుచిత్రాలు.

ఆ చిత్రపటాల మధ్య శాలిని తండ్రి విశ్వనాథ్ తెలుపు నలుపు రంగుల ఫోటో, దాని పక్కనే రవీంద్రనాథ్, వివేకానందల ఫోటోలు ప్రత్యేకంగా కనిపిస్తాయి.

ఆ కళాఖండాలను చాలావరకు తాతగారి కాలంలోనే సేకరించడం వల్ల, శాలిని వాటికి వారసురాలైంది.

తండ్రికి సుప్రీం కోర్ట్ న్యాయమూర్తిగా కీర్తి ప్రతిష్ఠలు ఉన్నా, ఆమె తన తాతగారి గురించే గర్వంగా చెప్పుకుంటుంది. తన చిన్నతనంలో ఆ తరం కళాకారులకు తమ ఇల్లు ఒక కేంద్రంగా ఉండేది. నాన్నగారు చనిపోయిన తరువాత ఈ చిత్రాల గురించి తెలీక చాలావాటిని అమ్మ పంచిపెట్టింది. అట్లా అమ్మ పంచిపెట్టిన చిత్రమే రెండు మూడు చేతులు మారి తిరిగి ఆమె దగ్గరకు వచ్చింది. అదే రహ్మాన్ చుగ్తాయ్ చిత్రం.

> ఆ ఇంట్లోని శిల్పాలూ, చిత్రాలూ, పూలూ, ఫోటోలు ఆమె కన్నీళ్ళకి వేదనాభారంతో కుంగిపోతున్నట్టు కనిపించసాగాయి.

గత దశాబ్దంగా శాలిని పరంపరగా వేస్తున్న చిత్రాలు పువ్వులు. పువ్వులతోనే ఆమె కేన్వాస్‌లు నిండిపోయాయి. ఆకులు, చెట్లు, ప్రకృతి సుందర దృశ్యాలు, ఆకాశంలో మేఘాలు, సంధ్యలు, ఋతువులు, కాలం– అంతా ఆమె పువ్వుల రూపంలో వర్ణమయం చేస్తుంది. మన అంతరంగంలో వెల్లివిరిసే పువ్వులవి. ఆమె చిత్రాలు వర్ణ ఇంద్రజాలం అని శ్లాఘిస్తారు విమర్శకులు.

ఇదే చివరిరోజు. మళ్ళీ ఈ బొమ్మల ప్రపంచంలోకి వచ్చే అవకాశం లేదు. దగ్గరకు పోయి ఆ చిత్రాల ముందు నుంచుని ప్రార్థించి వీడ్కోలు చెప్పుకుంటున్నాను. ఎంతో ఇష్టమైన చిత్రాలు నాకిప్పుడు అవి. దాదాపు అర్ధగంటకు పైగానే గడచిపోయింది.

తడికళ్ళతో వచ్చింది శాలిని.

"చూడు రావ్! ఉత్తమ్ ఏమి చేసిందో" అని ఉప్పొంగివస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది.

రాహుల్‌కి ఇష్టమని గాజర్ హల్వా, కుల్ఫీ; వర్మకి ఇష్టమని కాజూ పకోడీ, మలాయ్ కోఫ్తా; ఉత్తమ్ కోసం రసమలాయి, మామిడిపళ్ళూ; వాళ్ళు భోజనం చేసి వెళ్ళాలని ఉదయం నుంచి ఆ ఏర్పాట్లే. ఏవీ ముట్టుకోకుండా వెళ్ళిపోయారు. మామిడిపండు ముక్కలని కూడా పిల్లలకి ఇష్టమైనా పెట్టనివ్వలేదు.

అవన్నీ చెప్పుకొని, మరోసారి కెరటంలా దుఃఖం ఒడ్డున విరుచుకుపడడంతో శాలిని లోపలికి వెళ్ళిపోయింది. ఈసారి ఆమె ఏడుపు హాల్‌లోకి వినిపిస్తూనే ఉంది. మున్నీ మీద వ్యామోహంతో శాలిని దుఃఖం.

లోపలకు ఆమె గదిలోకి వెళ్ళి శాలినిని ఓదార్చాలని ఉంది. అయినా, అడుగులు ముందుకు పడడం లేదు. ఆమె దుఃఖం బయట పడడమే మంచిది. ఆ దుఃఖం అట్లానే కరిగి గుండెల్లో గడ్డకట్టుకుపోయిన కన్నీటిని తోడేసేయాలి. ఉద్వేగాగ్నికి దుఃఖమంతా కరిగి ఉప్పొంగిపోవడమే శాలినికి ఇప్పుడు అవసరం.

మున్నీ ఆశ ఇవాళ్టితో తెగిపోయినట్టే. ఆ నెత్తురే ఆమె కన్నీరైంది.

ఆ ఇంట్లోని శిల్పాలూ, చిత్రాలూ, మొక్కలూ, పూలూ, ఫోటోలు, ఇంకా ఇతర కళాఖండాలన్నీ ఆమె కన్నీళ్ళకి వేదనాభారంతో కుంగిపోతున్నట్టు కనిపించసాగాయి. శాలిని ఏడుపు ఇంకా ఇంకా ఉద్రేకపూరితమైంది. కరణ్ ఆమె గదిలో ఉన్నాడు. ఆందోళన పడుతున్నాడు. నిస్సహాయంగా కూచున్న నన్ను చూస్తున్నాడు.

కరణ్ పిలుస్తున్నాడు– చూపుల్తో.

శాలిని వెక్కి వెక్కి ఏడుస్తున్నది– బోరున. నేను గదిలోకి వెళ్ళినట్టు తెలిసి ఆ దుఃఖం మరింత తీవ్రమైంది. ఇల్లంతా వణికిపోయేట్టుగా గొంతు. చిన్న పిల్లవాళ్ళు ఏడ్చినట్టు.

ఏమైంది శాలినీ! ఎందుకు? ఎందుకు? శాలినీ... శాలినీ... నా వైపు చూడు శాలినీ... ఇటు చూడు శాలినీ...

"అవనీశ్ చంద్ర చెప్పింది గుర్తు తెచ్చుకో. మున్నీ అమ్మా అని నిన్ను మాత్రమే పిలుస్తుంది. ఉత్తమ్‌ని కాదు. నువ్వే మున్నీకి అమ్మవి. పెద్దయితే మున్నీ నీ దగ్గరకే వచ్చేస్తుంది. ఉత్తమ్ మనసు మారి మున్నీని ఇక్కడే విడిచేస్తుందేమో. ఎందుకంత బాధ పడతావ్ శాలినీ! మున్నీకి నీవే నిజమైన అమ్మవు. అవనీశ్ చంద్ర చెప్పిందే సత్యం."

"అమ్మకి ఫోన్ కలుపు రావ్" అని టెలిఫోన్ బుక్‌ని తెరిచి నా చేతుల్లో పెట్టింది. లాస్ ఏంజిలిస్. నంబర్ వెంటనే దొరికింది. వెంటనే–


"హలో దిస్ ఈజ్ మిసెస్ విశ్వనాథ్!"

అదృష్టం అమ్మే మాటాడుతున్నది. "అమ్మే". కార్డ్‌లెస్ ఆమె చేతిలో పెట్టాను. ఫోన్ అందుకుని "అమ్మా" అని బోరున ఏడవసాగింది శాలిని. గొంతులోంచి మాటలు రావడం లేదు. కెరటాలు కెరటాలుగా ఏడుపు. మాటలు పలకవు. శాలినీ ఏడువు. ఇంకా ఇంకా ఏడువు. నీ దుఃఖాన్ని అణచుకోవద్దు. శాలినీ ఏడువు. ఇంకా ఇంకా ఏడువు. దుఃఖమేఘాలు ఇంకా ఇంకా వర్షించనీ. ఒక్క మేఘ శకలం కూడా కనిపించనంత నిర్మలంగా నీ మనసు తేలికవ్వనీ.

ఆరు నిమిషాలు... ఏడు... ఎనిమిది... తొమ్మిది...

ఏడుపును, ఉద్రేకాన్ని అదుపు చేసుకునే ప్రయత్నమే చెయ్యడం లేదు శాలిని.

"అమ్మా!... నాకు భయంగా ఉంది. నువ్వు వెంటనే బయల్దేరి ఢిల్లీ వచ్చేసేయ్. గంట తరువాత మళ్ళీ



ఫోన్ చేస్తాను. రావ్ మాట్లాడతారు విను."

నా చేతులవైపు ఫోన్ పెట్టింది.

క్లుప్తంగా మున్నీ కథ చెప్పాను అమ్మకి. ఆమె ఆందోళన తగ్గింది. తాను రెండు రోజుల్లో బయల్దేరబోతున్నట్టు చెప్పమన్నది అమ్మ.

ఏడుపు తగ్గింది. ముఖం నిండా కురుస్తున్నట్టు చెమట. ఆమె మంచం మీద పడిపోయింది. ఆమె మంచానికి సమీపంగా కూచున్నాము ఇద్దరం. మధ్యలో కరన్ లేచివెళ్ళి, ఫ్రిజ్‌లోంచి చల్లని నీళ్ళూ, టవల్ తీసుకుని వచ్చి కూచున్నాడు. ఆమెను చూస్తూ కూచున్నాడు.

శాలినికి ఏడుపుతో శోష వచ్చినట్టుంది. సొమ్మసిల్లిపోయినట్టుంది. ఆమెకి శరీరస్పృహ ఉన్నట్టు లేదు. ఆమె నిద్రపోతున్నట్టుగా ఉంది.

ఏం చెయ్యాలో తోచలేదు. ఆమె ముఖం ప్రశాంతమైంది. అలసట తగ్గిపోయి విశ్రాంతిగా... నిద్రపోతున్నట్టుగా ఉంది.

రెండు గంటలకు పైగానే ఆమె కళ్ళు ఎప్పుడు తెరుస్తుందా అని చూస్తూ కూచున్నాము. పదిన్నరైంది. ఆమె కళ్ళు తెరిచి చూసింది.

కరన్ నీళ్ళిచ్చాడు తాగమని. ఆమెకు వంటచేసి రోజూ అన్నంపెట్టే కరన్. నేపాల్ గ్రామంలో పుట్టి ఢిల్లీలో పెరుగుతున్న, ఇంకా ఇరవయ్యేళ్ళు కూడా నిండని కరన్. శాలినికి ఏం ఇష్టమో, ఏం కావాలో తెలిసిన కరన్.

"రావ్! ఇంకా ఉన్నావా" అని చూపులతోనే దగ్గరకు పిలిచింది.

"రావ్! భయంగా ఉంది రావ్!"

ఏం చెప్తాను నేను మాత్రం. "ధైర్యం తెచ్చుకో శాలినీ! ధైర్యం తెచ్చుకో." ఆమె భయానికి కారణం నా ఒక్కడికి మాత్రమే తెలుసు.

"భయం లేదు శాలినీ! ప్రమాదం తప్పిపోయింది."

"నువ్వు అమ్మకి ఇంతదూరంలో లేవా ఏమైంది. అట్లాగే మున్నీ! మున్నీ నీ బిడ్డే శాలినీ! కొద్దికాలం దూరం కావచ్చు. దానికే బాధపడితే ఎలా? ఉత్తమ్‌కి ఈ సంగతి తెలిస్తే మున్నీని నీ దగ్గరే విడిచిపెట్టిపోవచ్చు" అని నా ఓదార్పు. నాకే నమ్మకం లేని మాటలు. ఆమెకు- ప్రవాహంలో కొట్టుకుపోతున్న ఆమెకు నిలదొక్కుకోవడానికి ఊతం దొరికినట్టు ఉండాలని.

"రావ్! ఆరోగ్యం ఇబ్బంది పెడుతుందేమో! ఏమన్నా... భయంగా ఉంది రావ్!" అని శాలిని నా వైపు శూన్య దృక్కులతో చూస్తున్నది.

"ఇవాళ రావ్ నాతోపాటే ఉండాలి ఇక్కడే." నా వైపు నిస్సహాయంగా ఆమె చూపులు.

"రావ్ సాబ్ ఇక్కడే భోంచేస్తారు తెలిసిందా కరన్!"

ఆమెతోపాటు ఆ ఇంట్లో చాలాసార్లే భోంచేశాను. ఇదివరలో శాలిని 'ఇక్కడ భోంచేసి వెళ్ళవచ్చులే రావ్' అని ఆదేశించే గొంతు ఇవాళ లేదు. ఇప్పుడు శాలిని గొంతులో దీనమైన ఆవేదన. దిక్కుతోచని నిస్సహాయమైన చూపులు.

కరన్ ఇచ్చిన చల్లని నీళ్ళని శాలిని చిన్నగా తాగుతున్నది- ఔషధం లాగా. తీర్థజలం లాగా.

ఆమె కోలుకుంటున్నది.

"కానీ రావ్, అవసరం అనుకుంటే డాక్టర్ అవనీశ్ చంద్రని వెంటనే పిలవాల్సి ఉంటుంది. అమ్మ వచ్చేవరకు నువ్వు ఇక్కడే ఉండాల్సి ఉంటుంది. ఫోన్ గుర్తుందా?"

ఆరేళ్ళ కిందట ఆ ఫోన్ నంబర్ నాలిక మీద ఉండేది. ఢిల్లీలో ఫోన్ నంబర్లు మారిపోయాయి. ఏమో. గుర్తు వచ్చింది. ఊఁ.

టెలిఫోన్ బుక్‌ని మరోసారి నా వైపు నెట్టింది శాలిని.

డాక్టర్ అవనీశ్ చంద్ర మాకు వైద్యుడు మాత్రమే కాదు, తండ్రిలాంటివాడు.

చికిత్స కోసం వెళ్ళినప్పుడల్లా ముచ్చట్లు పెట్టేవాడాయన. ఎక్కువగా పర్యాటక కేంద్రాల గురించి చెప్పేవాడు.

పర్యటనలు, ముఖ్యంగా పర్వతారణ్యాల్లోని పుణ్యక్షేత్రాల పర్యటనల గురించి చెప్పేవాడాయన. హాస్యోక్తులూ, కథలూ చెప్తే కడుపుబ్బ నవ్వేవాళ్ళం. ఆయన గదిలో ఒకే ఒక ఫోటో ఉంది. చార్లీ చాప్లిన్ ఫోటో.

భగవంతుడు- అన్నిటికన్నా ముఖ్యంగా గొప్ప ఔషధం- తెలుసునా రావ్ అని చెప్పింది ఆయనే. భగవంతుడు అంటే ఏమిటనుకున్నావ్. ప్రేమ. ప్రేమ లీల. ప్రేమ విశ్వరూపం. ప్రేమ అంటే ఏమనుకున్నావ్ సేవ. టాల్‌స్టాయ్ కథ 'వేర్ లవ్ ఈజ్ దేర్ గాడ్ ఈజ్' కథ చదివావా- ఇలా ఎన్నో కొత్త విషయాలు చెప్పేవాడాయన.

ఆ రోజుల్లో దాదాపు ఆర్నెల్లపాటు ఆయన చికిత్సలోనే ఉన్నాన్నేను. జనక్‌పురిలో ఉండేవాడాయన. ఢిల్లీలోని ప్రసిద్ధ సైకియాట్రిస్టులలో ఆయనకు మంచి పేరుంది. ఆయన వట్టి వైద్యుడు మాత్రమే కాదు, ప్రేమమూర్తి. అవును. ఒకానొక డిసెంబర్ నెల తొలివారంలో డాక్టర్ అవనీశ్ చంద్ర దగ్గరే శాలినితో నా తొలి పరిచయం.

నెలరోజుల పాటు మేము తరచు అక్కడే కలుసుకునేవాళ్ళం. ఓ రాత్రి డాక్టర్ అవనీశ్ చంద్రకి అతిథులం మేము. అక్కడే చాలా పొద్దుపోయింది. దార్లో నన్ను ఇంటి దగ్గర మునిర్కాలో విడిచిపెట్టి శాలిని వెళ్ళిపోయింది. ఆమె ఇంకా ముందుకు, తూర్పుగా గుల్‌మొహర్ పార్క్ పోవాలి. ఆ రోజుల్లోనే వర్మతో నా పరిచయం. ■